# ఆత్మార్పణం

రచన:
శ్రీ వై. వి. రాజారావు

'అంబులెన్స్' వచ్చి చలపతియింటిముం దాగింది.

కాని తీవ్రపరిస్థితుల్లోనే అంబులెన్స్ వస్తుం దని అందరికీ తెలిసినవిషయమే. ఆ వూర్లో వా రంరోజులుగా కలరా వీరవిహారం చేస్తోంది. ఎంతోమంది అమాయకప్రాణాలు ఆఘోరవ్యాధికి బలి అయిపోయాయి అప్పటికే.

నలుగురు సహాయంపట్టి చలపతిని అంబులెన్స్‌లోనికి చేర్చారు చలపతిప్రక్కన అతని భార్య అనసూయ, తమ్ముడు కూర్చొన్నారు. అంబులెన్స్ కదలింది. ఆదృశ్యం చూచినగుంపు గొల్లుమంది!-

చలపతి హెడ్‌క్వార్టర్స్ అస్పత్రిలో చేరి ఆవేళ రెండోరోజు. అయినా వ్యాధియేమాత్రం తిరుగుముఖం పట్టలా, రాత్రింబవళ్ళువచ్చి యెవరో వొకరుచూచి పోవటమేకాకుండా ప్రతిక్షణం అనసూయ చలపతిప్రక్కనే వుండి ఆతని బాగోగులు చూడసాగింది. డాక్టర్లువచ్చి గంటగంటకు మందులు, ఇన్‌జెక్షన్స్‌యిచ్చి పోతూనేవున్నారు. అయినా ఫలితంమాత్రం కనుపించలేదు.

నాలుగోరోజు వుదయానికి చలపతిముఖంలో ఆశారేఖ గోచరించింది. ఎక్కడోధర్మం జయించినట్టుంది. ఆరోజుసాయంత్రమే చలపతిని డిశ్చార్జ్ చేశారు.

తనకొచ్చిన ఘోరమైన అంటువ్యాధికి గాలి సోకితే తమకెక్కడఆ వ్యాధివస్తుందోనని, తన స్వంతతమ్ముడు, చెల్లెలు, ఆఖరకు తనకు జన్మ యిచ్చిన తల్లికూడా లోపలభయపడి పైపైనే తిరుగుతూవచ్చారు. ఆ నాలుగురోజులు చలపతివిషయంలో కానీ, తనభార్య అనసూయ మాత్రం అనుక్షణం తనే సర్వస్వంగా భావించీ సేవచేసి. తనని బ్రతికించుకొంది. తను నిజంగా అనసూయకి ఆ జన్మాంతం ఋణపడివున్నాడు

\+ + +

మరోరెండురోజుల గడిచాయి. ఆవేళ యెందుకో చలపతికి, అనసూయ చాలా నీరసంగా అగుపించింది.

కారణం యేమిటని అడిగాడు చలపతి. ఎంతో బలవంతంచేయగా చెప్పింది చలపతితో. తనకికూడా యెందుకో కడుపులోవోమా దిరివుందని, ప్రొద్దుటినుంచీ, వాంతులయ్యాయనీ, బేధులుకూడా అవుతున్నాయనీ. మరుసటిరోజు యేదైనా మంచిడాక్టరు వద్ద మంచి మందిప్పిస్తానని, ఆరాత్రికి విశ్రాంతితీసుకోమ్మని చెప్పాడు చలపతి అనసూయతో. సరేనని తల వూపింది. అనసూయ, ఆ రాత్రిపక్కపైన పడుకొంది అనసూయ, అతినీరసంతో ఈలోకాన్న మరచిపోయి. అంతే!-ఆ రోజు రాత్రిపడుకున్న అనసూయ మరి నిద్రలేవనే లేదు.

ఆమె అసువులు ఆ రాత్రియెప్పుడో అనంత వాయువుల్లో కలసి పోయాయి!

